జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 31-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 742 పేజీలు: 4 వెల : రూ.7

# అడుగడుగునా.. జగన్నినాదం

✳ విశాఖ నుంచి శ్రీకాకుళం వరకూ పూలతో ఘన స్వాగతం ✳ అభివాదం చేస్తూ ముందుకుసాగిన జగన్ ✳ జగన్ వెంటే మేం అన్నట్టుగా సాగిన యాత్ర ✳ అంపోలు జైలు వద్దకు మూడు గంటల ఆలస్యంగా చేరిన కాన్వాయ్ ✳ అడుగడుగునా పోలీసు ఆంక్షలు ✳ ములాఖాత్ సమయం ముగియడంతో అప్పలరాజుతో జగన్ ములాఖత్ రద్దు ✳ జైలు బయటనే సీదిరి కుమారుడు, భార్యను పరామర్శించిన జగన్మోహనరెడ్డి ✳ ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన వైసీపీ అధినేత ✳ చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు ఆలోచనలే ✳ సీదిరి కుటుంబానికి అండగా ఉంటాం ✳ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి

శ్రీకాకుళం, జులై 30 (వార్త): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర పర్యటనకు భారీ స్పందన లభించింది. గురువారం విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వరకు రోడ్డు మార్గంలో సాగిన జగన్ ప్రయాణంలో దారి పొడవునా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జగన్ కాన్వాయ్ వెళ్లే మార్గాల్లో అభిమానులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని ఘన స్వాగతం పలికారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి ఇది మొదలైంది. పలుచోట్ల కాన్వాయ్ ఆగడంతో జగన్ వాహనం దిగి ప్రజలకు అభివాదం చేశారు. ఆప్యాయంగా వాళ్లను పలకరించి.. సమస్యలను విన్నారు. ఈ క్రమంలో ఆయన వాహనం నెమ్మదిగా ముందుకు కదలింది. జగన్ పర్యటన ఆంక్షలు నడుమ ముందుకుసాగింది. గురువారం ఉదయం అటు వైపు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు పెట్టి కాపలా కాశారు. కానీ, జనం మాత్రం 'జగన్ వెంటే మేం' అని కదిలారు. ఆంక్షలను దాటుకుని జగన్ దగ్గరకు చేరుకున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో మొదలైన జన వాహిని.. శ్రీకాకుళం దారి పొడవునా కనిపించింది. మహిళలు, యువత, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జగన్‌కు స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూ జగన్ తన పర్యటనను కొనసాగించారు.

## అప్పలరాజుతో జగన్ ములాఖత్ రద్దు



వైసీపీ నేత సీదిరి అప్పలరాజుతో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ ములాఖత్ రద్దయింది. రోడ్డు ప్రమాదం కేసులో అప్పలరాజు అరెస్టయి శ్రీకాకుళం సమీపంలోని అంపోలు జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఆయనతో ములాఖత్‌కు అనుమతి కోరగా.. గురువారం మధ్యాహ్నం 2-3 గంటల మధ్య రావాలని జైలు అధికారులు జగన్‌కు సమయమిచ్చారు. అయితే జైలు వద్దకు ఆయన సాయంత్రం 5 గంటల తర్వాత చేరుకున్నారు. నిర్ణీత సమయం దాటిపోవడంతో ములాఖత్‌ను అధికారులు రద్దు చేశారు. ఆ తర్వాత జైలు వద్దే అప్పలరాజు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు.

## చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు ఆలోచనలే: వైఎస్ జగన్

మాజీ మంత్రి సీదిరి అప్పల రాజు కుటుంబంపై చంద్రబాబు సర్కార్ కుట్రకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్



జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. యాక్సిడెంట్‌ను హత్య కేసుగా మార్చి సీదిరి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందన్నారు. అసలు యాక్సిడెంట్ కేసును హత్య కేసుగా ఎలా మారుస్తారు? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. అంపోలు జైలులో ఉన్న సీదిరిని పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్ జగన్.. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి సర్కారు అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరుగుతున్నాయనే దానికి ఇదే నిదర్శనమన్నారు. నీట్ రాసి.. తన తండ్రిలాగా డాక్టర్ అవ్వాలని అనుకున్నాడు సీదిరి కుమారుడు. తెలిసో తెలియకుండా యాక్సిడెంట్ చేశాడు. కానీ కేసును ట్విస్ట్ చేసి హత్య చేశాడని, కుట్ర చేసి సీదిరి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు. అనుకోని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదం జరిగితే.. ఆ పిల్లాడి జీవితాన్ని నాశనం చేయాలని చూడటం ఎంతవరకు సరైందని ప్రశ్నించారు. బీసీల్లో సీదిరి మంచి నాయకుడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాబట్టి. చిన్న పిల్లాడు చేసిన యాక్సిడెంట్‌ను కుట్రగాను. హత్యగాను చిత్రీకరించి సీదిరి కుటుంబాన్ని ఇరికించే కార్యక్రమం ఎంతవరకు ధర్మం. అతిసామాన్యమైన కుటుంబం నుంచి వచ్చి వైద్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అప్పల రాజును ఇబ్బంది పెట్టేలా తన కెరీర్‌ను నాశనం చేయాలని దుర్మార్గకపు ఆలోచన చేస్తున్నారు. 18 ఏళ్ల విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తున్న చంద్రబాబు.. మనిషా? రాక్షసుడా? అని మండిపడ్డారు. ఇదే టీడీపీ నేతలు ఎవరైనా చేస్తే ఇలాగే శిక్షలు విధిస్తారా? అని నిలదీశారు. పాతపట్నం ఎమ్మెల్యే కుమారుడు యాక్సిడెంట్ చేస్తే.. ఆ కేసులో ఎవరిని అరెస్టు చేశారని ప్రశ్నించారు. హత్య చేసేందుకు ప్రయత్నం చేస్తే.. ప్రమాదంలో గాయపడ్డ బాధితుడ్ని రక్షించేందుకు సీదిరి కుమారుడు ప్రయత్నించాడు. 108కి ఫోన్ చేశాడు. సీపీఆర్ చేశాడు. సీదిరి సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు యాదవ మంత్రిని పంపించి ర్యాలీలు చేస్తారా? అదే చంద్రబాబుకు బాధిత కుటుంబానికి మంచి చేయాలన్న మనసుంటే ఇరు కుటుంబాల మధ్య సయోధ్య చేకూర్చి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చేసే ప్రయత్నం చేయాలన్నారు. బాబుకు పేదలంటే ప్రేమలేదు. బీసీలను ఓటు బ్యాంకు కోసం వాడుకుంటాడు. చంద్రబాబుకు బీసీలు కాదు యాదవులంటేనే ప్రేమలేదు. ప్రకాశం జిల్లాలో యాదవ కుటుంబం దాడి చేసి తిరిగి ఆ కుటుంబంపైనే కేసు పెట్టించిన ఘనుడు చంద్రబాబు. చరిత్రలో తొలిసారి యాదవ మహిళను వైఎస్సార్‌సీపీ విశాఖ మేయర్‌ని చేసింది. ఆ తర్వాత చంద్రబాబు కుట్రతో ఆమెకు పదవిని దూరం చేశాడు. విశాఖలో యాదవ భవన్‌ను పూర్తి కాకుండా అక్కడో కుట్ర చేశారన్నారు. మత్స్యకారులు ప్రమాదానికి గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యుల్ని పరామర్శించలేదన్నారు. బాబు.. నోరు తెరిస్తే అబద్ధాలు, చేస్తే మోసాలు. ప్రశ్నిస్తే వాళ్లమీద తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, జీవితాలు నాశనం అవుతాయన్న జ్ఞానం లేదు. సీదిరి అప్పలరాజు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తోందన్నారు. అప్పల రాజు విషయంలో న్యాయం గెలుస్తోంది. త్వరలో ఆయన జైలు నుంచి బయటకు వస్తారు' అని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. ఆయన వెంట వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు చింతాడ రవి, పేరాడ తిలక్, పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తరోడ్డు వద్ద తోపులాట

ఆమదాలవలస నియోజకవర్గం నుంచి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆమదాలవలస నుంచి కొత్తరోడ్డు కూడలికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. బందోబస్తు విధుల్లో ఉన్న బూర్జ ఎస్ఐ ప్రవల్లిక, సమన్వయకర్త చింతాడ రవి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా తోపులాట చోటుచేసుకుంది. సీఐ సన్యాసినాయుడి అక్కడకు చేరుకుని సర్ది చెప్పారు.



## అడుగడుగునా ఆంక్షలు..

జగన్ పర్యటన సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీకాకుళం తరలివచ్చారు. దీంతో జాతీయ రహదారి రద్దీగా మారింది. పోలీసులు ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి వెళ్లకుండా ఆంక్షలు పెట్టినా తోసుకుంటూ వైసీపీ శ్రేణులు ముందుకు కదిలారు. నరసన్నపేట టోల్‌గేట్ వద్ద వైసీపీ యువనేత ధర్మాన కృష్ణ చైతన్యను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే అంపోలు జంక్షన్ దగ్గర ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని పోలీసులు అడ్డుకున్నారు. పైడిభీమవరం వద్ద మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను అడ్డుకోగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా వైసీపీ నేతలు శ్రీకాకుళం వెళ్లకుండా పోలీసులు ఆంక్షలు పెట్టడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి.





## ప్రైవేట్ కళాశాలలో.. విద్యార్థినులకు..
# భద్రత ఏదీ?

✳ పలాస-కాశీబుగ్గలోని ఓ కళాశాలలో ఆలస్యంగా పోక్సో కేసు వెలుగులోకి ✳ ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులు ✳ కాలేజీలో పనిచేసే వ్యక్తికి రిమాండ్ ✳ ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ప్రైవేట్ కళాశాలను నడుపుతున్న వైనం ✳ అధికార పార్టీ నాయకుడి కాలేజీ కావడంతో గుట్టురట్టు కాకుండా మేనేజ్ చేసినట్లు సమాచారం ✳ ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

పలాస, జులై 30 (వార్త): చదువుకోవడానికి కళాశాలలకు వెళ్లే విద్యార్థినుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇటీవల వెలుగుచూసిన పోక్సో కేసు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిపై అక్కడే పనిచేస్తున్న ఓ వ్యక్తి అత్యాచారం చేసినట్టు బయటపడింది. విద్యార్థిని తల్లిదండ్రులు కళాశాల యాజమాన్యంను నిలదీయడంతో పాటు పీఎస్‌ను కేసు పెట్టడంతో ఆ వ్యక్తిపై పోక్సో కేసు పెట్టి రిమాండ్‌కు పంపించినట్టు సమాచారం. ఆ కళాశాల అధికార పార్టీ నేతకు చెందిన వారిది కావడంతో ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా కళాశాల యాజమాన్యం మేనేజ్ చేసేసింది. మరో విషయమేమిటంటే కళాశాలను ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిర్వహిస్తున్నాడు. ప్రైవేట్ కళాశాలలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రవర్తనపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థినులు వేధింపులకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంస్థలో భద్రతా ప్రమాణాలను అమలు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థ నిర్వహణలో ఉన్న కొందరు రాజకీయంగా ప్రభావం కలిగి ఉండటంతో బాధ్యతాయుత చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రైవేట్ కళాశాలలో అసలేం జరిగింది, విద్యార్థినిపై అత్యాచారం ఘటనలో ఎవరెవరు ఉన్నారు? గుట్టు రట్టు కాకుండా చూసిందెవరు? ఆ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎవరు? ఎవరి పాత్ర ఏమిటి? ఎవరెవరికి ముడుపులు అందాయి? పోక్సో కేసు ఏంటి తదితర పూర్తి వివరాలతో 'జాతీయ వార్త'లో త్వరలో సమగ్ర కథనం..

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఇంటింటికీ ఎమ్మెల్యే.. ప్రజల గడప వద్దకే సంక్షేమం

- గడపగడపకూ ప్రభుత్వ పాలన
- ప్రజలతో ముఖాముఖి
- ప్రతి ఇంటికీ పథకాల సమాచారం
- 17, 18వ వార్డుల్లో పర్యటన
- సమస్యలు విన్న శిరీష



**పలాస, జులై 30 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరవేసే లక్ష్యంతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 17, 18వ వార్డుల్లో గురువారం "ఇంటింటికీ ఎమ్మెల్యే" కార్యక్రమాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నిర్వహించారు. దువ్వాడ శ్రీకాంత్, సురేంద్ర కుమార్ (చిన్ని) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పారదర్శక పాలన అందిస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువత ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల సమాచారం ప్రతి ఇంటికీ చేరేలా "ఇంటింటికీ ఎమ్మెల్యే" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, పారిశుధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి ప్రాధాన్యత క్రమంలో చర్యలు చేపడతామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలాస మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టీడీపీ సీనియర్ నాయకులు పి.విఠల్, లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణ, గురిటి సూర్యనారాయణ, మల్లి శ్రీనివాస్, సప్పు నవీన్, డొక్కాడి శంకర్, కొత్త సత్యం, సవర రాంబాబు, రామకృష్ణ, పైల చక్రధర్, గుంట ధర్మారావుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ



**పలాస, జులై 30 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలంలోని గోవిందపురం, గునాలపాడు, సీతంపేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులకు ప్రతి నెలా అందుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ సంక్షేమంపై ఆరా తీసి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా కల్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఎమ్మెల్యే గౌతు శిరీష మార్గదర్శకత్వంలో ప్రతి అర్హ కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చేనేత పరిరక్షణ సమ్మేళనం విజయవంతం చేయాలి



**పలాస, జులై 30 (వార్త):** చేనేత రంగ పరిరక్షణ, చేనేత కార్మికుల సంక్షేమం, ఆత్మగౌరవ పరిరక్షణ లక్ష్యంగా ఆగస్టు 5న విజయవాడలో నిర్వహించనున్న చేనేత సమ్మేళనంను విజయవంతం చేయాలని శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. బీజేపీ కార్యాలయంలో గురువారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సమ్మేళన ప్రచార కరపత్రాన్ని తేజేశ్వరరావు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 9.30 గంటలకు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి భారీ శోభాయాత్ర ప్రారంభమై తుమ్మలపల్లి కళాక్షేత్రానికి చేరుకుంటుందని చెప్పారు. చేనేత రంగ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల విస్తరణ, సంప్రదాయ చేనేత కళల పరిరక్షణ, నూతన మార్కెట్ అవకాశాలపై సమ్మేళనంలో చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. చేనేత కార్మికులు, బీజేపీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## కిడ్నీ రోగికి ఎన్టీఆర్ భరోసా పింఛన్



**పలాస, జులై 30 (వార్త):** డయాలసిస్ చికిత్స పొందుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు నాగిరి వీరమ్మకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ కింద నెలకు రూ.10 వేల పింఛన్ మంజూరైంది. కొత్తగా పింఛన్ మంజూరు కావడంతో తెలుగు యువత అధ్యక్షుడు కిక్కిరి ఢిల్లీరావు గురువారం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. డయాలసిస్ చేయించుకుంటున్న అర్హులైన కిడ్నీ రోగులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం నెలకు రూ.10 వేల పింఛన్ అందజేస్తోందని ఆయన తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో వీరమ్మకు పింఛన్ మంజూరైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలాస పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డు దుష్యంత్, 6వ వార్డు సభ్యురాలు మద్దిల వనిత, భిలాయ్ ప్రవాసి బొడ్డు జగన్, సాలిన ప్రవీణ్, సార సాంబమూర్తి, సచివాలయ ఉద్యోగి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం



**పలాస, జులై 30 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసిన ఆమె, వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ సంక్షేమంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సామాజిక భద్రతకు అండగా నిలుస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ పాలన కొనసాగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కుక్కకాటుపై విద్యార్థులకు అవగాహన

**ఇచ్ఛాపురం, జులై 30 (వార్త):** కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కుక్క కాటు పై అప్రమత్తత తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం ప్రధాన ఉపాధ్యాయులు ప్రమీల కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేంద్ర నాథ్ పట్నాయక్, జ్యోతి,రామ్మోహన్, పాపారావు, మినుచంద్ర, నీలిప్, భాస్కర్, ధర్మరాజు ఉప్పాడ పాపారావు, కోటేశ్వరరావు,అమిత, సుప్రభ, రాజ్యలక్ష్మి,వాణి, దేవకీ, భవాని, స్వప్నారాణి పాల్గొన్నారు . ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.



# కార్మికులను అడ్డుకున్న పోలీసులు

- పోలీసు నిర్బంధం సరికాదు : సీఐటీయూ
- వేతనాల సవరణ కోరితే నిర్బంధమా?
- ఉద్యమాలను అణచలేరు : గణపతి



**పలాస, జులై 30 (వార్త):** షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్ రంగంలో కనీస వేతనాలు సవరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాకు వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి తెలిపారు. పలాస సమీపంలోని కిష్టుపురం ఫ్లైఓవర్ వంతెన, బెండిగేటు వద్ద కార్మికులను పోలీసులు నిలువరించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ఉద్యమాలను నిరోధించడం ప్రభుత్వానికి తగదన్నారు. పోలీసు నిర్బంధాలతో కార్మిక ఉద్యమాలను అణచివేయలేరని హెచ్చరించారు. షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్ రంగంలో గత 19 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించకపోవడంతో యాజమాన్యాల దోపిడీ పెరిగిందని ఆరోపించారు. కార్మికుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం యజమానుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించి, వేతనాల సవరణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్బంధ వైఖరిని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు సిందిరి వల్లభ, సీహెచ్ అప్పన్న, అల్లాడ కృష్ణారావు, ఎస్. చిరంజీవి, నారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.రవి, కె.వెంకటి, ఎస్.రమేష్, తిరుపతి, జగ్గుముఖి, శకుంతల, త్రివేణి పాల్గొన్నారు.

## యూరియా పూర్తిగా అందుబాటులో ఉంది

- మండలానికి 270 మెట్రిక్ టన్నుల నిల్వలు
- వ్యవసాయ అధికారి ఎస్. వెంకట్రావు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచన



**సారవకోట, జులై 30 (వార్త):** సారవకోట మండలంలోని రైతులకు ఈ సాగు సీజన్‌కు అవసరమైన యూరియాను పూర్తిగా అందుబాటులో ఉంచామని వ్యవసాయ అధికారి ఎస్.వెంకట్రావు తెలిపారు. రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మండలానికి 270 మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా ఎరువులను కొనుగోలు చేసుకోవచ్చని, యూరియా కొరతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవసాయ శాఖ రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, డిమాండ్‌కు అనుగుణంగా నిల్వలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. పంటల దిగుబడులు మెరుగుపడేలా వ్యవసాయ శాఖ సూచనల మేరకు యూరియాను సమతుల్యంగా వినియోగించాలని రైతులకు సూచించారు. అవసరానికి మించి ఎరువులు నిల్వ చేసుకోవడం లేదా అనవసరంగా కొనుగోలు చేయడం మానుకోవాలని, అవసరమైన మేరకు మాత్రమే తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన



**పలాస, జులై 30 (వార్త):** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పలాసలోని సూర్యతేజ జూనియర్ కళాశాలలో గురువారం ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవా సంఘం గౌరవాధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా తీవ్రమైన నేరమని, ముఖ్యంగా యువతులు, బాలికలు అపరిచితులను నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నారులను అక్రమంగా తరలించి వెట్టి చాకిరీ చేయించడం, అవయవాల అక్రమ రవాణా వంటి నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వివరించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక నేరాలు అత్యంత తీవ్రమైనవని, విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు బి.కె.ఆర్. పట్నాయక్, ప్యానెల్ న్యాయవాది డాక్టర్ కె. లోకేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డి. పద్మజీ కామేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్న కిట్టాలపాడు జడ్పీ పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

- మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన వెంకటరమణ
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశం



**సారవకోట, జులై 30(వార్త):** చిన్న కిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మద్దు వెంకటరమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలకు చేరుకున్న ఆయన నేరుగా మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, వంట విధానంపై ఆరా తీశారు. వంటశాలను పరిశీలించిన ఎంఈఓ, భోజనం పరిశుభ్రంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తయారవుతోందా అనే అంశాలను తనిఖీ చేశారు. అనంతరం వంట ఏజెన్సీ సభ్యులతో మాట్లాడుతూ, విద్యార్థులకు రుచికరమైన, పోషక విలువలు కలిగిన భోజనాన్ని సకాలంలో అందించడం తమ బాధ్యత అని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలైతే విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు వారి హాజరు శాతం కూడా పెరుగుతుందని ఎంఈఓ పేర్కొన్నారు. సంబంధిత సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# తొగిరిలో ఆధ్యాత్మిక సత్సంగం



**సారవకోట, జులై 30(వార్త):** తొగిరి గ్రామంలో గురువారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామంలోని శివాలయం ఆవరణలో నిర్వహించిన ఆధ్యాత్మిక సత్సంగం కార్యక్రమానికి ఇస్కాన్‌కు చెందిన కృష్ణ భక్తులు హాజరై భక్తి సందేశాలను ప్రజలకు చేరవేశారు. కార్యక్రమంలో భాగంగా కృష్ణ భక్తులు హరినామ సంకీర్తనలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. భక్తి గీతాలను ఆలపిస్తూ గ్రామ వీధుల గుండా సాగిన ఈ ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అనంతరం నిర్వహించిన సత్సంగంలో ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. భగవద్భక్తి, సనాతన ధర్మం, నైతిక విలువలు, సత్సంగం ప్రాముఖ్యతపై భక్తులకు వివరించి ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భక్తులు భజనలు, కీర్తనల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. ఇటువంటి సత్సంగాలు యువతలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంతో పాటు సమాజంలో సత్సంకల్పాలను పెంచేందుకు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఇస్కాన్ భక్తులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో 11 కొత్త స్పౌజ్ పెన్షన్లు మంజూరు

- లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలు అందజేసిన నేతింటి భారతి
- వితంతువుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం: భారతి



**నరసన్నపేట, జులై 30(వార్త):** నరసన్నపేట మండలంలో నూతనంగా 11 మంది వితంతువులకు స్పౌజ్ (వితంతు) పెన్షన్లు మంజూరయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 1న రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా గురువారం పెన్షన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ నేతింటి భారతి విశ్వేశ్వరరావు పట్టణంలోని లబ్ధిదారులకు నూతన పెన్షన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వితంతువులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఆధారంగా తక్షణమే స్పౌజ్ పెన్షన్లు మంజూరు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసు కుంటున్నామని, సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నూతనంగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'లీప్' యాప్ ఫీడ్‌బ్యాక్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి

- యూటీఎఫ్ నాయకులు డిమాండ్

**మందస, జులై 30(వార్త):** పాఠశాల విద్యాశాఖ 'లీప్' యాప్‌లో అమల్లోకి తెచ్చిన విద్యార్థుల ఫీడ్‌బ్యాక్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, రాష్ట్ర కుటుంబ సంక్షేమ బోర్డు డైరెక్టర్ గుంట కోదండరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మందస మండలంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా నాయకులు బహడపల్లి, బేతాళపురం, లోహరిబంద, అంబుగాం, సిరిపురం, కృష్ణాపురం తదితర ఉన్నత పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లీప్ యాప్‌లో విద్యార్థుల ద్వారా ఉపాధ్యాయులపై సేకరిస్తున్న ఫీడ్‌బ్యాక్ విధానం అత్యంత అశాస్త్రీయంగా ఉందని విమర్శించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల స్థాయికి తగని రీతిలో ప్రశ్నలు రూపొందించి, ఉపాధ్యాయుల పనితీరును మూల్యాంకనం చేయడం సరికాదన్నారు. బోధన, నిర్వహణ ఒత్తిళ్లతో సతమతమవుతున్న ఉపాధ్యాయులను ఈ విధానం మరింత మానసిక ఆందోళనకు గురిచేస్తోందని, గురుశిష్యుల మధ్య ఉండాల్సిన స్వేచ్ఛాయుతమైన, పవిత్రమైన వాతావరణాన్ని ఇది దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల నైతిక నిబ్బరాన్ని దెబ్బతీసేలా ఉన్న ఈ క్లిష్టమైన ప్రశ్నావళిని, ఫీడ్‌బ్యాక్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉపాధ్యాయుల ఆత్మగౌరవ రక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మందస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లు మజ్జి శివకేశవరావు, తరణి సోమేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## హంసరాళి, మందవూరు, బుడంబోలలో ఇంటింటికీ

**మందస, జులై 30(వార్త):** హంసరాళి, మందవూరు, బుడంబో గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ, ప్రజా సమస్యలను కూటమి నాయకులు తెలుసుకునారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, క్లస్టర్ ఇంచార్జీ ముంజేటి చంద్రశేఖర్, మందస పీఏసీఎస్ చైర్మన్ తమిరియా భాస్కరరావు, ప్రసాద్ బెహరా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 'తల్లికి వందనం'తో ప్రభుత్వ పాఠశాలకు విరాళం అందించిన జనసేన నాయకుడు

**ఆమదాలవలస, జులై 30(వార్త):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా అందిన ఆర్థిక సహాయాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించకుండా, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి వెచ్చించి జనసేన పార్టీ నాయకుడు పంచిరెడ్డి శ్రీనివాసరావు ఆదర్శంగా నిలిచారు.

ఆమదాలవలస మండలం జీకే వలస గ్రామానికి చెందిన ఆయన తీసుకున్న ఈ నిర్ణయం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. తన పిల్లలకు 'తల్లికి వందనం' పథకం కింద ప్రభుత్వం అందించిన రూ.26,000 మొత్తాన్ని జీకే వలస ప్రభుత్వ పాఠశాల అవసరాల కోసం వినియోగించారు. ఈ నిధులతో పాఠశాలకు ఒక బీరువా, నాలుగు కుర్చీలు, ఒక గ్యాస్ స్టవ్, నాలుగు స్టూల్స్ కొనుగోలు చేసి అందజేశారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి 10 చిన్న కుర్చీలు, రెండు పెద్ద కుర్చీలు, ఒక ఫ్యాన్‌ను బహూకరించారు. గురు పౌర్ణమి సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేసి విద్యార్థుల్లో ఆనందాన్ని నింపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు సత్యం మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని దృష్టిలో



పెట్టుకుని పంచిరెడ్డి శ్రీనివాసరావు చేసిన సహాయం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడటమే కాకుండా, సమాజంలోని ఇతరులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రిప్ కరెంట్, డ్రగ్స్‌పై అవగాహన




**ఎచ్చెర్ల, జులై 30 (వార్త):** పొన్నాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం 8వ నుంచి 10వ తరగతి విద్యార్థులకు రిప్ కరెంట్, డ్రగ్స్ నియంత్రణ, మహిళలు-బాలికల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి. హరికృష్ణరావు తన సిబ్బందితో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సముద్రంలో స్నానానికి వెళ్లే సమయంలో రిప్ కరెంట్‌ను ఎలా గుర్తించాలి, సముద్రపు నీటి రంగులో వచ్చే మార్పులు, ప్రమాదకర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణాలను ఎలా కాపాడుకోవాలనే అంశాలను వివరించారు. అదేవిధంగా డ్రగ్స్‌కు బానిస కావడం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరిగే దౌర్జన్యాల నివారణ, పోక్సో (గూజూగా) చట్టంలోని ముఖ్య నిబంధనలను వివరించారు. డ్రగ్స్ అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే కోస్టల్ సెక్యూరిటీ పోలీసుల టోల్‌ఫ్రీ నంబర్ 1093 లేదా కళింగపట్నం ఎస్‌హెచ్‌ఓ మొబైల్ నంబర్ 9392914712కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సందడిగా పింఛన్ల పంపిణీ



**జి.సిగడాం, జులై 30(వార్త):** సామాజిక పింఛన్‌ల పంపిణీ శుక్రవారం జిల్లావ్యాప్తంగా సందడిగా సాగింది. మండలంలో పెంట గ్రామంలో నూతనంగా మంజూరైన మక్క లక్ష్మమ్మ, మక్క రాయుడమ్మ, లావేటి నారాయణమ్మ లకు స్పౌజ్ (విడో) పెన్షన్లను గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కూటమి నాయకలు మక్క నారాయణరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. రెగ్యులర్ పింఛన్ నగదును ఎప్పటిలాగే ఇళ్లకు వెళ్లి సిబ్బంది పంపిణీ చేశారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రారంభం కాగా 11 గంటలకే 80శాతం మందికి అందించారు. సాయంత్రం ఐదు గంటలకు 90.60శాతం మందికిపైగా లబ్ధిదారులకు పింఛన్‌ల పంపిణీ పూర్తిచేశారు. అందుబాటులో లేని వారికి తర్వాత ఇవ్వనున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ బత్తిన స్వాతి, నాయకులు డోల పార్వతీ, మీసాల రమణ ఉన్నారు.




## ఐషీ ఘోష్ అరెస్ట్ యత్నాలను ఖండించిన ఎస్ఎఫ్ఐ

**- పలాస ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థుల నిరసన**

**-ప్రజాస్వామ్య హక్కులను అణచివేయొద్దని డిమాండ్**

**పలాస, జులై 30 (వార్త):** ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్‌ను అరెస్ట్ చేయడానికి ఢిల్లీ పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ పలాస ఎస్టీ హాస్టల్‌లో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన విద్యార్థుల ఆందోళనకు ఐషీ ఘోష్ నాయకత్వం వహించారని, విద్యార్థి హక్కుల కోసం పోరాడుతున్న నాయకురాలిపై పాత కేసులను ఆధారంగా చేసుకుని అరెస్ట్‌కు ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమాలను కేసులు, అరెస్టులతో అణచివేయాలని చూడడం సరైన విధానం కాదని, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికీ శాంతియుత నిరసన తెలిపే హక్కు ఉందని అన్నారు. ఐషీ ఘోష్‌పై చేపడుతున్న చర్యలను వెంటనే విరమించుకుని ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని ఢిల్లీ పోలీసులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు "ఢిల్లీ పోలీసుల మొండి వైఖరి నశించాలి", "ఐషీ ఘోష్‌పై కక్షసాధింపు చర్యలు ఆపాలి", "విద్యార్థి ఉద్యమాలపై దాడులు నిలిపివేయాలి", "ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలి" అంటూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ తన ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. చంటి, ఎస్. ప్రదీప్, ఎస్. పవన్, ఎస్. హిమేష్, ఎస్. వంశీ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడు సాలిన కామయ్య ఆకస్మిక మృతి

**- సంతాపం తెలిపిన పలువురు నాయకులు**



**మందస, జులై 30(వార్త):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, సాలిన కామయ్య ఆకస్మికంగా మరణించారు. వయోభారం కారణంగా అనారోగ్య సమస్యలున్నప్పటికీ, హటాత్తుగా మరణించడంతో ఉద్దానంలో విషాదఛాయలు అలముకున్నాయి. మందస మండలంలోని బహడపల్లి గ్రామానికి చెందిన కామయ్య అంకిత భావం కలిగిన తెలుగుదేశం పార్టీ నాయకుడు. ఆయన కుటుంబం కూడా అదే దారిలో పయనిస్తోంది. కామయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాలిన మాధవరావు తెలుగుదేశం పార్టీలో చురుకుగా ఉంటూ.. మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చిన్న కుమారుడు గిరి పోలీసు డిపార్ట్ మెంట్ లో పని చేస్తున్నారు. మాధవరావు భార్య పార్వతి తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి, ఎంపీటీసీగా పని చేశారు. కామయ్య మరణంతో బహడపల్లి గ్రామస్తులు కన్నీటి పర్యవంతమయ్యారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, సాలీన కామయ్య కుటుంబ బంధువులు, అభిమానులు ఆయన మరణం పట్ల సంతాపం తెలిపి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కామయ్య మృతి పట్ల సాలిన వెంకటరావు, మామిడి మాధవరావు, మామిడి కృష్ణారావు, డొక్కరి వీరాస్వామి, డొక్కరి లచ్చయ్య, సాలిన ఉమాపతి, వంకల మాకయ్య తదితరులు ఆయన కుటుంబానికి సానుభూతి, సంతాపం తెలిపారు.

# లబ్ధిదారుల వద్దకే 'ఎన్టీఆర్ భరోసా'



**పోలాకి, జులై 30 (వార్త):** పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి మండలం మబగాం గ్రామంలో గురువారం నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పాలనకు పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి ఇంటి వద్దకే అందజేస్తోందన్నారు. గతంలో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఆ ఇబ్బందులకు ముగింపు పలుకుతూ గుమ్మం వద్దకే పింఛన్లు అందించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇంటి వద్దకే పింఛన్ అందడం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ఎంతో సౌకర్యంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పోలాకి పీఏసీఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, సీనియర్ నాయకులు తెలుగు నాగేశ్వరరావు (మాష్టారు), కాయ రవి, ధర్మాన అమ్మనాయుడు, మెండ రమేష్, మెండ రామన్న, తెలుగు వేణుగోపాలరావు, దుంగ సీతారాం, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ శిరీష..సంక్షేమంపై అవగాహన



**పలాస, జులై 30 (వార్త):** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం కాశీబుగ్గ రోటరీ నగర్‌లో ఇంటింటా పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటిని సందర్శించిన ఆమె, ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. స్థానికుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పర్యటన సందర్భంగా మహిళలు, యువత ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తమ అభిప్రాయాలను వెల్లడించిన మహిళలు, స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని గౌతు శిరీష భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు రూపొందించిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'తల్లికి వందనం', 'భోగాపురం ఎయిర్‌పోర్ట్', 'ఎన్టీఆర్ భరోసా', 'వలసలు వద్దు-ఉత్తరాంధ్ర ముద్దు', 'అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం', 'మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం', 'అభివృద్ధి-సంక్షేమమే కూటమి ధ్యేయం' వంటి సందేశాలతో అలంకరించిన రంగవల్లులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ పథకాల సారాంశాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ రంగవల్లులను నాయకులు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

భోగాపురం విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులు ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడతాయని, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి వలసలు తగ్గే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విటల్‌రావు, ఎయిమ్స్ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, పైల చక్రధర్, మల్లి పెద్ది నరేంద్ర (చిన్నీ), కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# కళాకారులకు ఘన సన్మానం

**కవిటి, జులై 30 (వార్త):** రాజపురం గ్రామానికి చెందిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి 101 నిమిషాలు అఖండ భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పలువురు సీనియర్ కళాకారులతో కూడిన భజన బృందం ఆధ్యాంతము ఆలపించిన గాన మంజరి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం తెలుగు పండితులు రాజపురం గ్రామానికి చెందిన పండి డిల్లేశ్వరరావు మాస్టారు, బారువ గ్రామానికి చెందిన ప్రముఖ గాయకులు దేవేంద్రనాథ్ పండా, ప్రముఖ కవి ఆధ్యాత్మికవేత్త కవిటి గ్రామానికి చెందిన బందరు దుర్గాప్రసాద్, ప్రముఖ సంగీత విద్వాంసులు జింకిభద్ర గ్రామానికి చెందిన నిమ్మన నూకరాజు, ప్రముఖ సంగీత విద్వాంసులురెల్ల జోగారావు నాయుడు, సత్య సాయి బాలవికాస్ విభాగం ప్రతినిధి భూలక్ష్మి ప్రముఖ కళాకారులు ఆనింగి చిరంజీవి తదితరులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## స్కూల్ బ్యాగులు, విద్యా కిట్ల పంపిణీ

**- ట్రస్ట్ ఆధ్వర్యంలో 85 మంది విద్యార్థులకు సాయం**

**- విద్యార్థులకు చేయూత అభినందనీయం: ఎంఈఓలు**



**నరసన్నపేట, జులై 30(వార్త):** నిరుపేద విద్యార్థులకు విద్యాభ్యాసంలో ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఓ ట్రస్ట్ ఆధ్వర్యంలో 85 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమం నరసన్నపేటలో నిర్వహించగా విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి నరసన్నపేట మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) పేడాడ దాలినాయుడు, పోలాకి మండల ఎంఈఓ ఎస్. శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, విద్యా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యకు అవసరమైన సామగ్రిని అందించడం అభినందనీయమైన కార్యక్రమమని కొనియాడారు. సమాజంలో సేవా దృక్పథంతో ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలు విద్యాభివృద్ధికి విశేషంగా దోహదపడతాయని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు విద్యకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని తెలిపారు. విద్యార్థులు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## కొత్తవలసలో పెన్షన్ల పంపిణీ



**ఆమదాలవలస, జులై 30 (వార్త):** ఆమదాలవలస నియోజకవర్గంలోని ఆముదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో గురువారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు రూ.4,000, రూ.6,000, రూ.15,000 చొప్పున ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పాలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ఒక్కరూ కూడా ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లీ, కలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని శేఖర్, మండల అధ్యక్షుడు నూకరాజు, మాజీ సర్పంచ్ మోహన్, గురువుబెల్లి వెంకటరావు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికులను అడ్డుకోవడం సిగ్గు చేటు



**మందస, జులై 30(వార్త):** కార్మికులను పోలీసులతో అడ్డుకోవడం సిగ్గు చేటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.కేశవరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు వెళ్తున్న కార్మికులను ప్రభుత్వం పోలీసులు తో అడ్డుకోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని, ధర్నా జయప్రదం కోసం నెల రోజులుగా ప్రచారం చేస్తూ.. ఈ రోజు కలెక్టర్ కు సమస్యలు విన్నవించడానికి వెళ్లకుండా అడ్డొకోవడం ప్రజాస్వామ్యంలో తగదని అన్నారు. కె.కేశవరావు మాట్లాడుతూ కనీస వేతనాలు లేక కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుందని, వెంటనే వేతనాలు సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.ఏకాశి, ఎన్.లచ్చయ్య, మోహనరావు, బి.మల్లేసు, కె.కృష్ణారావు, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## హరిపురంలో మెగా వైద్య శిబిరం విజయవంతం

**మందస, జులై 30(వార్త):** ఉయ్ ఫర్ ఆల్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హరిపురం సీహెచ్‌సీ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. రిమ్స్ హాస్పిటల్ శ్రీకాకుళం నుంచి సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ మనోహర్ తో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా కల్తీ ఆహారాలతో వాతావరణ కాలుష్యం, తాగునీరు కాలుష్యం వలన ఇలా మరెన్నో కారణాల వలన మన శరీరంలో చెడు మార్పులు జరగటం వలన కలిగే ఎన్నో ప్రాణాంతక వ్యాధులలో అతి ముఖ్యమైన గుండె సమస్యలపై రిమ్స్ వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. గుండె సమస్యలు రావటానికి కారణలు ఏమిటి.. ఆహార అలవాట్లు ఎలా ఉండాలి.. లక్షణాలు ఏమిటి.. వెంటనే చేయవలసిన ప్రాథమిక చికిత్స ఏమిటి.. వెంటనే చేయవలసిన ట్రీట్మెంట్ ఏమిటి.. గుండె నొప్పి.. ఊపిరి తీసుకోవడం కష్టం అవ్వటం.. తల తిరగడం.. చమట పట్టి శరీరం చల్లబడడం, చాతి నొప్పితో పాటు నడుము, భుజాలు, మెడ దవడల్లో కూడా నొప్పి, కడుపులో వికారం, వాంతులు అవ్వడం, కడుపు ఉబ్బరంగా మారడం, గుండె మంట తదితర సమస్యలను వివరించారు. అవసరమైన వారికి ఉచితముగా ఈసీజీ తీశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.విజయలక్ష్మి, పైల మనోహర్, కె.స్వరాజ్యలక్ష్మి, గొలుసు మురళీకృష్ణ, కొంచాడ సురేష్ కుమార్, ముడిమించి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# జగన్ పర్యటన..జనసంద్రం

## మున్సిపాలిటీ మళ్ళీ వైఎస్సార్సీపీదే!



**ఇచ్ఛాపురం, జులై 30 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ మరో సారి వైస్సార్సీపీ దే నని మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. వరుసగా మూడో సారి మున్సిపల్ పీఠం కైవసం చేసుకొని హాట్రిక్ కొడతామని అన్నారు.తాడేపల్లి లో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యలక్ష్మి, పిలక సంతోష్(వైస్సార్సీపీ యువ నాయకులు ) దంపతులు కలిశారు.ఈ సందర్భంగా, పార్టీ బలోపేతం కోసం తాము నిరంతరం కృషి చేస్తున్నామని, జగన్ నాయకత్వంలో ఎల్లప్పుడూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తామని, అలాగే ఇచ్ఛాపురంలో వైఎస్సార్సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కి మాట ఇచ్చామని తెలియజేశారు.

## ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి



**మందస, జులై 30(వార్త):** ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు కోరారు. మందస మండలంలోని హరిపురంలో గల భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్, శ్రీకాకుళం, మందస మండల విద్యాశాఖ తరపున వైద్య నిర్ధారణ పరీక్షలో ఎంపిక కాబడిన వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించినటువంటి ఉపకరణాలను సక్రమంగా దివ్యాంగ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మీరు వినియోగించుకోవాలన్నారు. ఎంపిక కాబడిన ఉపకరణాలు బిగ్ వీల్ చైర్లు 7, స్మాల్ వీల్ చైర్లు 4, చెవిటి మిషన్ 3 సెట్స్, టిఎల్ఎం కిట్టు ప్రైమరీ లెవెల్ 3, సెకండరీ లెవెల్ 3 కిట్లు విద్యార్థులకు మండల విద్యాశాఖ తరపున భవిత కేంద్రంలో అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మణరావు, భవిత ఉపాధ్యాయులు కిల్లి ప్రసాదరావు, బమ్మిడి అంబిక, ఫిజియోథెరపిస్టు ఆక్య, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ, జడ్పీహెచ్ స్కూల్ ప్లస్ హరిపురం ప్రత్యేక ఉపాధ్యాయులు సాంబమూర్తి, మందస బీసీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వర, సిజివి ఉష, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జీఆర్ పురంలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు




**మందస, జులై 30(వార్త):** జీఆర్ పురం పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 205మంది విద్యార్థులకు మందస మండల నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న 11మందికి కంటి అద్దాలకు సిఫార్సు చేశారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రమణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ జి.ప్రసన్న, లత, ఆశ జి.పద్మలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జలుమూరులో విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

**- చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల పనుల నేపథ్యంలో ఆరు గంటల పాటు నిలిపివేత**

**- వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ విజ్ఞప్తి**

**జలుమూరు, జులై 30 (వార్త):** జలుమూరు మండలంలోని 33/11 కేవీ చల్లవానిపేట, బుడితి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఆగస్టు 1 (శనివారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ. నరసింహకుమార్ తెలిపారు. విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టనున్నందున ఈ మేరకు విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వ్యవస్థను మరింత సురక్షితంగా, అంతరాయాలు లేకుండా నిర్వహించేందుకు ఈ నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమయంలో వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. జలుమూరు మండలంలోని చల్లవానిపేట, బుడితి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని తమ అవసరాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.



**- కిక్కిరిసిన కొత్త రోడ్డు జంక్షన్**

**-వైఎస్సార్సీపీ శ్రేణుల ఘన స్వాగతం**



**ఆమదాలవలస, జులై 30 (వార్త):** ఆమదాలవలస నియోజకవర్గంలో కొత్త రోడ్డు జంక్షన్ గురువారం వైఎస్సార్సీపీ శ్రేణులతో జనసంద్రంగా మారింది. పార్టీ నాయకుడికి స్వాగతం పలికేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. దీంతో కొత్త రోడ్డు జంక్షన్ పార్టీ జెండాలు, బ్యానర్లు, నినాదాలతో కిక్కిరిసిపోయింది. డప్పు వాయిద్యాలు, బాణాసంచా, పూలమాలలు, జైకారాల మధ్య నాయకుడికి ఘన స్వాగతం పలికిన కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. యువత, మహిళలు, రైతులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్వాగత కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పార్టీ పట్ల తమ అంకితభావాన్ని మరోసారి చాటుతూ ఉత్సాహంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అండతో వైఎస్సార్సీపీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల ప్రయోజనాలే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజలకు మరింత చేరువ అవుతామని తెలిపారు. కొత్త రోడ్డు జంక్షన్‌లో ఏర్పడిన జనసందోహంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడినా, పోలీసులు పరిస్థితిని సమర్థంగా నియంత్రించి వాహనాల రాకపోకలను సజావుగా కొనసాగించారు. కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగియడంతో నాయకులు.. కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కృష్ణచైతన్య బృందాన్ని అడ్డుకున్న పోలీసులు

**నరసన్నపేట, జులై 30(వార్త):** మడపాం టోల్‌గేట్ వద్ద గురువారం మధ్యాహ్నం స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నరసన్నపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య బృందాన్ని టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కాన్వాయ్ రూపంలో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు పార్టీ నాయకులతో మాట్లాడి నిబంధనల ప్రకారం కాన్వాయ్‌కు అనుమతి ఇవ్వలేమని తెలిపారు. అయితే, కొద్దిమంది నాయకులను అయినా వెళ్లేందుకు అనుమతించాలని కృష్ణ చైతన్య పోలీసులను కోరారు. ఇందుకు వారు నిరాకరించడంతో కొంతసేపు టోల్‌గేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని పోలీసులు అదుపులో ఉంచడంతో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.



## లింగాలవలసలో ముమ్మర వాహన తనిఖీలు

**- వైసీపీ అధినేత జగన్ శ్రీకాకుళం పర్యటన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు**

**- వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఎస్సైలు**



**జలుమూరు, జులై 30(వార్త):** వైసీపీ అధినేత .. జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. జలుమూరు మండలం లింగాలవలస ప్రధాన రహదారి వద్ద గురువారం ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించి భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. జలుమూరు ఎస్సై అశోక్ బాబు, సారవకోట ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో రహదారిపై ప్రయాణిస్తున్న ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను నిలిపి పత్రాలు, వాహనాల్లో తీసుకెళ్తున్న సామగ్రిని పరిశీలించారు. అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. వైసీపీ అధినేత శ్రీకాకుళం పర్యటనకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉందన్న ముందస్తు సమాచారంతో భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ప్రజలు పోలీసులకు సహకరించాలని, వాహనాల సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొని రహదారిపై భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.




## మడపాం టోల్‌ప్లాజా వద్ద భారీ పోలీసు బందోబస్తు

**- మాజీ సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం**

**నరసన్నపేట, జులై 30(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో నరసన్నపేట మండలం మడపాం ప్రధాన రహదారిలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా టోల్‌ప్లాజా వద్ద పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందిని మోహరించింది. పర్యటన సందర్భంగా ర్యాలీలు, భారీ ఊరేగింపులకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ స్పష్టం చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యకర్తలు ఎవరూ గుంపులుగా తరలిరాకూడదని పోలీసులు ముందుగానే హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. జిల్లాలోని పలు ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలు పోలీసు శాఖ సూచనలను పాటించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో




**ఇచ్ఛాపురం, జులై 30 (వార్త):** డొంకూరు సముదాయ కేంద్రం పరిధిలో గల 9పాఠశాలలను ఇచ్ఛాపురం మండల విద్యాశాఖాధికారి కాకర సూర్యారావు పర్యవేక్షించారు. ప్రార్థనా సమయానికి డొంకూరు పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థుల సంసిద్ధత కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి సూచనలు సలహాలు ఇచ్చారు . అభ్యసన సామర్థ్యాలు వెనుకబడిన విద్యార్థుల్ని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సమీక్షా చేశారు. పెద్దలక్ష్మిపురం, చిన్నలక్ష్మిపురం పాఠశాలల్లో విద్యార్థులతో ముచ్చటించి విద్యా సామర్థ్యాలు పరిశీలించారు. డొంకూరు పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి ఉత్తమ ఫలితాల సాధనకై ప్రత్యేక సూచనలు ఇచ్చి మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. సన్యాసిపుట్టుగ,కేసుపురం, నీలపపుట్టుగ పాఠశాలల్లో విద్యార్థులను గణితం, తెలుగు ఆంగ్లంపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి విద్యార్థుల్ని చైతన్య పరచారు. ఈదుపురం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ఉత్తమ ఫలితాల సాధనకై సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయ సమీక్ష సమావేశం నిర్వహించి ఉపాధ్యాయ బోధన డైరీలు పరిశీలించారు . విద్యార్థుల వర్క్ బుక్స్ క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థుల దస్తూరి, చతుర్విధ ప్రక్రియలు, భాషా సామర్థ్యాలు పెంపొందించవలసిందిగా ప్రతి విద్యార్థి దారా చదవడం, రాయడం నేర్పించి మండల విద్యావ్యవస్థను బలోపేతం చేయవలసిందిగా ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఎం ఈ వో 2 ఎస్.విశ్వనాథం పురుషోత్తపురం మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించి తదనంతరం 10వ తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధనకై సూచనలు సలహాలు ఇచ్చారు.

## అలరించిన నృత్యాలు

**ఇచ్ఛాపురం, జులై 30 (వార్త):** స్థానిక వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు గురు పౌర్ణమిని పురస్కరించుకొని డాన్స్ అకాడమీలో అకాడమీ వ్యవస్థాపకులు చిన్నా గురు స్వామి జయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. గురువు అంటే ఏమిటి ఒక గురువు యొక్క నిజమైన విజయం మంచి శిష్యులను తీర్చిదిద్దడమే కాదు ఆ.. శిష్యులను సైతం గొప్ప గురువులు గా తీర్చిదిద్దటంలో సాంప్రదాయమైన కూచిపూడి భరతనాత్యాన్ని నేర్పించడంలో ముందుకు సాగే దారిని కూడా గురు మార్గమని అకాడమీ నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్ అద్భుతంగా వివరించారు. గురువు కోసం ప్రతి ఒక్కరూ చక్కగా వివరించారు. చిన్నారులు ఈ చిన్నారులందరికీ చక్కని మార్గంలో పెట్టేవారు గురువు అయితే వీళ్ళని ప్రోత్సహించే తల్లితండ్రులు కూడా గురువులే అని చిన్న గురుస్వామి జయలక్ష్మి దంపతులు వివరించారు. ఈ కార్యక్రమంలో గురు శిష్య పరంపరను చిరస్థాయిగా సాగాలని డాన్స్ టీచర్స్ కావ్య. పూజ శ్రీ. జయ. లక్ష్మి. జాహ్నవి. లిఖిత. జయశ్రీ. సింధు. దీపిక. మధుశ్రీ. పల్లవి. రమ్య. దీక్షిత. పాల్గొని నటరాజ స్వామిని పూలమాలతో అలంకరించి గురుపాద పద్మములకు నమస్కరించి గురుపూజను అద్భుతంగా జరుపుకున్నారు. అనంతరం నిర్వహించిన నృత్యాలు అలరించాయి.



## జగన్ పర్యటనపై టీడీపీ విమర్శలు

**- 'డైవర్ట్ పాలిటిక్స్‌కు ప్రజలు మద్దతివ్వరని' వ్యాఖ్య**

**- పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం**

**శ్రీకాకుళం, జులై 30(వార్త):** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటనపై తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శలు గుప్పించారు. నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను పరామర్శించడం ద్వారా ప్రజలకు తప్పు సంకేతాలు పంపుతున్నారని ఆరోపించారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రహదారిలో ఉన్న టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తికరమైన పాలన అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజా మద్దతు కోల్పోయిన వైఎస్సార్సీపీ రాజకీయ ప్రాధాన్యం కోసం "డైవర్ట్ పాలిటిక్స్" చేస్తోందని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రమాద కేసులో చట్టపరమైన చర్యల అనంతరం రిమాండ్‌లో ఉండగా, ఆయనను పరామర్శించేందుకు వైఎస్ జగన్ జిల్లాకు రావడం బాధితులకు న్యాయం చేసే విధానం కాదని అభిప్రాయపడ్డారు. బాధితులను పరామర్శించకుండా నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి మద్దతు తెలపడం సరైన రాజకీయ విధానం కాదని పేర్కొన్నారు. అదేవిధంగా, వైఎస్సార్సీపీ నాయకులు కుల రాజకీయాలను ప్రోత్సహిస్తూ సమాజంలో విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఇలాంటి రాజకీయాలను గమనిస్తున్నారని, వాటిని అంగీకరించే పరిస్థితిలో లేరని అన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వ్యవస్థలు బలహీనపడ్డాయని, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల తగిన గౌరవం చూపలేదని టీడీపీ నాయకులు విమర్శించారు. గత రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్సీపీ నాయకత్వ తీరుపై ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కృష్ణం నాయుడు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, గార పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు వెంకట రమణమూర్తి, యాగళ్ల ప్రసన్నకుమార్, శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి పేరూరి నాగేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ సభ్యులు ధర్మాన నీలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546